15

# పునరుత్థాన అభయము అవసరమైయున్న సంఘము

## (1 కొరింథీయులకు 15:1-58)

ఆధునికానంతర ప్రపంచంలో అనేకులు లేనిపోని కేవలవాదములను – నిశ్చయత లేని, సంశయదూరమైన సత్యములను – నమ్ముదురు. ఇటువంటి వైఖరికి సంఘము ఎలా ప్రతిస్పందించవలెను? మనము సిద్ధాంతమును పలచనచేసి దానిని బలహీనపర్చాలా? అంగీకరించుటకు వారు తమ ఆమోదమును తెలియజేయు విషయాలను మాత్రమే బోధించుచు, అవిశ్వాసులతో సంప్రదింపులు జరుపాలా? ఇతరులు విశ్వాసించరని మనమెరిగిన సిద్ధాంతములను బహిరంగముగా ప్రకటించుటకు మనము భయపడుతూ దూరంగా ఉండాలా?

ఆయన కొరింథీయులకు తన మొదటి పత్రికను వ్రాసినప్పుడు పౌలుకు ఇటువంటి ప్రశ్నే ఎదురయ్యింది. కొరింథీయులలో కొందరు మృతుల పునరుత్థానమును సందేహించారు.[1] అయితే పౌలు ఈ ప్రశ్నను ఎదుర్కొనక ప్రక్కకు తొలగిపోలేదు ఎందుచేతనంటే అలా చేయడము వలన ఆయన ఎవరి మనస్సునైనా నొప్పించి వారిని అన్యాక్రాంతము చేయువచ్చును, సరికదా అలాగని చెప్పి పునరుత్థాన సిద్ధాంతము గూర్చి ఆయన రాజీపడలేదు. ఈ రెండూ చేయకుండా, క్రైస్తవులు ఒకానొక దినాన మృతులలో నుండి లేపబడుట అనునది లేదని చెప్పుచుండిరి వారి వాదోపవాదములు తప్పని నిరూపిస్తూ, ఆయన పునరుత్థానమును ప్రకటించాడు మరియు సమర్థించాడు. తన సదుద్దేశ స్థానమును నిశ్చలంగాను సహేతుకంగాను తర్కిస్తూ, అసత్య సిద్ధాంతములను ఆయన ఎదుర్కొన్నాడు. విశ్వాసమునకు సంబంధించిన విషయము తలెత్తినప్పుడు, సత్యము పక్షాన పౌలు స్థిరంగా నిలబడ్డాడు – గనుక మనము చేయాల్సింది కూడ ఇదే! ఈ అధ్యాయంలో పునరుత్థానము గూర్చి పౌలు చేసిన బోధలను మనము ఆలోచించుచుండగా, సత్యమును ఆయన ఎంత అచంచలముగా సమర్థించాడో మనము కూడ అట్లే సమర్థించాలని జ్ఞాపకముంచుకొందాము.

కొరింథులోని కొందరు ఉపదేశకులు మృతుల పునరుత్థానమునందు విశ్వసించలేదు. "క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడని ప్రకటింపబడుచుండగా, మీలో కొందరు మృతుల పునరుత్థానము లేదని యెట్లు చెప్పుచున్నారు?" అని పౌలు ప్రశ్నిస్తున్నాడు (15:12).

ఈ అబద్ధ బోధకులెవరు? వారు అన్యమతస్థులు కాదు. వారు క్రైస్తవులే. లేదంటే, పౌలు చేయుచుండిన వాదములకు అర్థముండదు. ఈ సహోదరులు మృతుల పునరుత్థానము లేదనలేదు, కానీ మరణించిన మానవులు భవిష్యత్తులో లేపబడుదురను అభిప్రాయమును తృణీకరించారు. వారు మరణమునకు తరువాత ఆత్మకు ఉండిన జీవమునకు సంబంధించిన ఏదో ఒక రూపము గూర్చి విశ్వసించియుండవచ్చును, కానీ శరీర పునరుత్థానము గూర్చి కాదు.

పౌలు పునరుత్థానము యొక్క అవసరత మరియు దాని లక్షణము గూర్చి చర్చిస్తూ వారి అపనమ్మకమునకు అడ్డుపడుచున్నాడు.

## పునరుత్థానము యొక్క అవసరత

### వారు అంగీకరించిన సువార్తకు ఆయువుపట్టైన ఒక అంశము

ఈ చర్చను మొదలుపెట్టుటకు, ఆయన కొరింథులో ప్రకటించిన సువార్త సందేశములో పునరుత్థానము ప్రాథమికమైన భాగమై యుండినదని పౌలు ఉద్ఘాటించి చెప్పుచున్నాడు (15:1-11).

పౌలు కొరింథీయులకు ప్రకటించిన సువార్తలో పునరుత్థానము ప్రధానాంశమై యుండినది. వారు దానిని అంగీకరించారు మరియు దానియందు నిలిచియుండినారు (15:1-5).[2] ఆయన ప్రకటించిన సువార్తలోని నాలుగు ప్రాథమికమైన వాస్తవములను వారికి మరొక సారి గుర్తుచేసాడు:[3] క్రీస్తు (1) మరణించాడు, (2) సమాధిచేయబడ్డాడు, (3) లేపబడ్డాడు, ఆ తరువాత (4) అనేకులకు అగుపించాడు (వారిలో పౌలు కూడ ఉన్నాడు; 15:4, 5). క్రైస్తవ విశ్వాసమునకు ఈ వాస్తవములను మించి ప్రాముఖ్యమైనది మరేదియును లేదు. అపొస్తలుల కార్యముల గ్రంథంలో సువార్త సందేశము ప్రకటింపబడిన తీరును గమనిస్తే, క్రీస్తు మృతులలో నుండి లేపబడినాడని బోధకుడు అనివార్యముగా నొక్కివక్కాణించుచుండెనని అర్థమగును (అపొస్తలుల కార్యములు 2:32; 13:30; 17:31 చూడుము).

### వారి విశ్వాసమునకు గల కీలకమైన అంశము

ఆ తరువాత, క్రీస్తు పునరుత్థానము క్రైస్తవుల ఇతర అవశ్యకమైన నమ్మికలపై ఎటువంటి ప్రభావము కలిగియున్నదో పౌలు వివరిస్తున్నాడు (15:12-19). కొరింథులోని అబద్ధ బోధకులు చెప్పుచుండినవి సరియైనవైనట్లయితే, నిజముగా, భవిష్యత్తులో మృతుల పునరుత్థానమే లేనట్లయితే – క్రీస్తు కూడ లేపబడలేదు, సరికదా మన విశ్వాసము కూడ వ్యర్థమే అని పౌలు వాదించుచున్నాడు (15:13-19). స్పష్టంగా, క్రీస్తు లేపబడినాడు కానీ క్రైస్తవులు లేపబడరని అబద్ధ బోధకులు విశ్వసించారు. గనుక ఇట్టి విశ్వాసము వలన ఏర్పడు పరిణామముల గూర్చి వారు తమలో తాము ప్రశ్నించుకొనవలెనని పౌలు వారిని బ్రతిమాలాడాడు. మృతులు లేపబడనట్లయితే, క్రీస్తు కూడ లేపబడలేదు. అంతమాత్రమేగాక, క్రీస్తు లేపబడనట్లయితే, మన విశ్వాసము వ్యర్థమైనదౌతుంది ఎందుచేతనంటే క్రైస్తవ విశ్వాసమునకు క్రీస్తు పునరుత్థానమే కేంద్ర బిందువు వలె ఆయువుపట్టైన అంశమై యున్నది. దీనిని సవివరంగా వివరించుటకు పౌలు ఈ క్రింది హేతువాదమును తెలియజేయుచున్నాడు:

1. మృతులు లేపబడనట్లయితే, క్రీస్తు కూడ లేపబడలేదు (15:13, 16).
2. క్రీస్తు లేపబడనట్లయితే, అపొస్తలులు చేయుచున్న ప్రబోధములు వ్యర్థమే (15:14, 15)
3. క్రైస్తవ విశ్వాసమునకు పునరుత్థానము మూలాధారమై యున్నందువలన, పునరుత్థానము లేకుండా విశ్వాసము వ్యర్థమే ఔతుంది (15:14, 17).

4. క్రీస్తు లేపబడనట్లయితే, క్రైస్తవులు యింకా వారి పాపములలోనే నిలిచియున్నారు (15:17).
5. క్రైస్తవులు యింకా వారి పాపములలోనే నిలిచియున్నట్లయితే, క్రీస్తునందు మృతినొందినవారికి ఎటువంటి నిరీక్షణ లేదు (15:18, 19).

క్రైస్తవ్యం యొక్క సత్యం క్రీస్తు పునరుత్థానం మీద ఆధారపడియుంది. పునరుత్థానం లేకపోతే క్రీస్తు లేపబడలేదు. అలా అయితే, క్రైస్తవులు "మనుష్యులందరికంటే దౌర్భాగ్యులై యుందురు" (15:19).

**వారి నిరీక్షణకు గల కీలకాంశము**

ఏదిఏమైనా, పౌలు పునరుత్థాన వాస్తవికత గూర్చి తన ఉద్ఘాటనను కొనసాగించుచూ ముందుకు వెళ్లాడు (15:20-28). పునరుత్థానుడైన క్రీస్తు "నిద్రించినవారిలో ప్రథమఫలమై యున్నాడు" అని ఘోషించాడు (15:20). అనగా, క్రీస్తు మరణించి మృతులలో నుండి లేపబడినట్లుగానే,"నిద్రించినవారు" (మృతులైనవారు) కూడ లేపబడుదురని మరొక మాటలో చెప్పుకొనవచ్చును.

తన వాదోపవాదమును సమర్థించుకొనుటకు, క్రీస్తును రెండవ ఆదాముగా వర్ణించుచు, పౌలు ఒక సాదృశ్యమును ఉపయోగించాడు. మొదటి ఆదాము చేసిన పాపమునకు ఫలితంగా, అందరు మరణించుదురు. క్రీస్తు పునరుత్థానుడయ్యాడు గనుక, క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు అందరు సజీవులుగా చేయబడుదురు (15:21, 22).[4] క్రీస్తు "ప్రథమ ఫలముగా" మృతులలో నుండి లేపబడియున్నాడు గనుక, మనము కూడ లేపబడుదుమనుటకు ఎటువంటి సందేహమైనను కలుగనవసరములేదు. ఆదామునుబట్టి మనము ఖచ్చితముగా మరణించువారమై యున్నట్లే, క్రీస్తునుబట్టి మనము మరలా సజీవులమై యుండుటకు లేపబడుదుము.

ఆ తరువాత, "అటుతరువాత" - రెండవ రాకడ సమయంలో - క్రీస్తు తండ్రియైన దేవునికి రాజ్యమును అప్పగించునని పౌలు చెప్పుచున్నాడు. ఏ అధికారమైనను ఆయనను వ్యతిరేకింపజాలదు, ఎందుచేతనంటే ఆయన తన శత్రువులందరిపై, మరణముతో సహా, విజయము సాధించాడు. ఆ సమయంలో, క్రీస్తు తానే తండ్రియైన దేవునికి లోపరచుకొంటాడు (15:24-28).

**అర్థవంతమైన వారి జీవితమునకు గల కీలకాంశము**

పౌలు యొక్క తరువాతి తర్కము కొందరు చేయుచుండిన పనిపై ఆధారపడి యున్నది (15:29-34). "*పునరుత్థానము లేనట్లయితే, మృతుల కొరకైన బాప్తిస్మము అర్థరహితమైనదే.*" కొందరు "మృతుల కొరకు బాప్తిస్మము పొందుచుండిరి" అని స్పష్టమగుచున్నది (15:29). అలవాటుగా అభ్యసింపబడుచుండిన ఈ వాడుక ఏమిటో ఖచ్చితంగా ఎవరికీ తెలియదు: అంతమాత్రమేగాక, ఈ అభ్యాసమును పౌలు ఆమోదించాడని మనము నమ్మవలెనని ఈ వాక్యభాగము మనలను కోరుట లేదు. ఇటువంటి చర్యలను అభ్యసించుట మరణము తరువాత జీవములో గల నమ్మికను ప్రతిబింబించునని ఆయన సూచించుచుండిన సామాన్య సూచనయై

యుండినది. ఈ ప్రజలే పునరుత్థానము లేదనుచుండినట్లయితే, వారు చేయుచుండిన కార్యములు వారి నమ్మికతో ఎటువంటి పొందికను కలిగియుండలేదని చెప్పవచ్చును.

*"పునరుత్థానము లేనట్లయితే, క్రైస్తవ జీవితము అర్థరహితమైనదే."* పౌలు తన స్వానుభవము గూర్చి మాటలాడుచున్నాడు (15:30-32ఎ). ఆయన ఎడతెరపిలేకుండా హింసింపబడినాడు. పునరుత్థానమే లేనట్లయితే, ఆయన క్రీస్తు యెడల విశ్వసనీయమైనవాడై యుండుటకును హింసలను సహించుటకును ఎటువంటి హేతువైనను మిగులదని పౌలు తన అంతరంగములోని భావమును తెలియజేయుచున్నాడు. బహుశ, కొరింథీయులలో కొందరు ఇదే విధంగా హింసలు అనుభవించి యుందురు. క్రీస్తు కొరకు శ్రమల ననుభవించుటకైనను వారు ఇష్టపడుట పునరుత్థానములో గల వారి విశ్వాసమునకు ఒక నిదర్శనమై యుండినది; కాబట్టి పునరుత్థానము లేదనుట, వారి చర్యలతో పొందిక లేనిదై యుండినది.

వాస్తవమునకు, పునరుత్థానమే లేనట్టయితే మనము క్రైస్తవ జీవితము జీవించుటకు ఏ కారణమైనను మిగిలియుండదని పౌలు చెప్పాడు "మృతులు లేపబడని యెడల, రేపు చనిపోదుము గనుక తిందము త్రాగుదము" అని ఆయన చెప్పుచున్నాడు (15:32బి).[5] పునరుత్థానము లేదని మనము చెప్పినట్లయితే, మనము అన్యజనులు జీవించుచున్నట్లే జీవించుట ఉత్తమము.

*"పునరుత్థానమునందువలన, క్రైస్తవులు క్రీస్తు యెడల విశ్వాసులై యుండవలెను."* సహజంగానే, పౌలు తన చర్చను ఇంతటితో ఆపుజేయలేకపోయాడు. మనము, పునరుత్థానమును అంగీకరించు క్రైస్తవులము, మన జీవితములు ఇతరుల జీవితములకు భిన్నమైనవిగా ఉండునట్లు చూచుకొనవలెనని అదనంగా చేర్చుట ఆయనకు తప్పనిసరైనది: మనము "దుష్ట సాంగత్యమునకు" దూరముగా ఉండవలెను (15:33) మరియు "నెమ్మదిగా ఆలోచించు మనస్సుగలవారము" కావలెను (15:34ఎ). స్పష్టంగా, కొరింథు సంఘములోని కొందరు సభ్యులు అవినీతిమయమైన జీవితములు జీవించుచుండిరి గనుక వారి జీవన శైలి సృష్టించగల శాశ్వత పరిణామముల గూర్చి యోచించవలసిన అవసరత ఏర్పడినది (15:34బి).

మృతుల పునరుత్థానము యొక్క అవసరతను గూర్చిన తన దృక్పథమును ఆయన సంగ్రహించుచూ, సువార్తను ప్రకటించుటకు క్రీస్తు పునరుత్థానము ఆయువుపట్టయి ఉన్నదని పౌలు చెప్పుచున్నాడు యేసు క్రీస్తు పునరుత్థానుడైన తరువాత ఆయన అగుపించిన నిదర్శనము, మనము కూడ, లేపబడుదుమని మరింత బలముగా రుజువుచేయుచున్నది. వాస్తవమునకు, మనము లేపబడనట్లయితే, మన విశ్వాసమువ్యర్థమే, మనకు నిరీక్షణ ఉండదు, మరియు క్రైస్తవ నీతి మరియు ఆసక్తి కూడ నిష్ప్రయోజనమే, క్రీస్తు లేపబడినాడు గనుక, మనము కూడ లేపబడుదుము; కాబట్టి, మనము నీతిమంతులముగా జీవించవలసిన అవసరత సహేతుకమైనది.

## పునరుత్థానము యొక్క స్వభావము

ఈ రోజుల్లో పునరుత్థానమును తృణీకరించువారు పౌలు 15:35లో అడుగుచున్న ప్రశ్ననే అడుగుచున్నారు: "మృతులేలాగు లేతురు? వారెట్టి శరీరముతో వత్తురు?" బహుశ, ఈ ప్రశ్న మత్తయి 22:23-33లో వ్రాయబడియున్నట్లు దాని స్వభావరీత్యా సద్దూకయ్యులు యేసును

అడిగిన ప్రశ్నవంటిదే అయి యున్నది. వారు "ఒక స్త్రీ ఏడుగురు పురుషులను వివాహము చేసికొనినట్లయితే, పునరుత్థానములో ఆమె ఎవరి భార్యయైయుండును?" అని అబ్బుర పడుచూ అడుగుచుండిరి. యేసుని ప్రశ్నించుచుండిన వీరికి సంబంధించినంత వరకు, ఆ సమస్య సమాధానములేని సమస్యయై యుండినది: కాబట్టి, పునరుత్థానము సాధ్యమయ్యే పని కాదని వారభిప్రాయపడ్డారు.

ఇటువంటి ప్రశ్నకే పౌలు ఇచ్చుచున్న సమాధానమును మనము ప్రశంసించగలుగునట్లు, "మృతులు లేపబడినప్పుడు వారు ఎటువంటి శరీరము కలిగియుందురు?" అను ఈ ప్రశ్నలో గల చిక్కుల గూర్చి మనము ఆలోచించవలెను. వారు మృతులైన తరువాత ఆత్మల వలె ఉనికి కలిగియుండుటకు కొనసాగుదురా లేదా అనునది అసలు సమస్య కాదు; కానీ, భౌతిక శరీరములు ఎలా లేపబడును అను విషయము గూర్చిన అవగాహన కొదువయై యుండుటయే పెద్ద సమస్యయై యుండినది.[6] సమాధిలో పాతిపెట్టబడిన భౌతిక కాయము దుమ్ముకు దుమ్ముగాను మట్టికి మట్టిగాను మారినట్లయితే, ఆ దేహము మరలా ఎలా లేపబడగలదు? ఒకరు మంటల్లో పడి పూర్తిగా కాలిపోయినట్లయితే, బూడిదయైపోయిన శరీరము మృతులలో నుండి ఎలా లేపబడగలదు? శరీర పునరుత్థానమును తృణీకరించుచుండిన ప్రజలను ఇటువంటి అంతుపట్టని ప్రశ్నలు బాధించుచుండినవి. వారడుగుచుండిన ప్రశ్నలకు జవాబులే లేవని వారనుకొనుచుండిరి; కాబట్టి, వారు పునరుత్థానమందు విశ్వసించలేదు.

## పునరుత్థానమైన శరీరము భౌతిక కాయమునకు భిన్నముగా నుండును

ప్రాథమికముగా, "పునరుత్థానమైన శరీరము భిన్నముగా నుండును" అనునది పౌలు ఇచ్చిన సమాధానమై యుండినది (15:35-49). వెవ్వేరు పదార్థములు వెవ్వేరు విధములైన శరీరములు కలిగియుండునని చూపించుటకు అపొస్తలుడు నానావిధ నిదర్శనాత్మక ఉదాహరణములను ఉపయోగించాడు.

*విత్తనములు.* మొదటిగా, పౌలు విత్తనములను పేర్కొనుచున్నాడు. ఒక విత్తనములో నుండి మొలక ఎదుగవలెనంటే ఆ విత్తనము మొదట చావవలెను (15:36). అదే విధముగా, మానవుడు మొదట చావవలెను అప్పుడు వాడు మరలా జీవించునను అంతర్భావమును పౌలు వ్యక్తము చేయుచుండెను. విత్తనములో నుండి ఎదుగు మొలక విత్తబడిన విత్తనము వలెనే అగుపించదు (15:37, 38). గనుక పురుత్థానమైన శరీరము సహితము పాతిపెట్టబడిన శరీరము వలెనే ఉండునని గాని ఉండవలెనని గాని ఆశించలేము.

*సజీవ ప్రాణులు.* ఆ తరువాత, సజీవముగానున్న ప్రాణుల శరీరములు వెర్వేరుగా ఉంటాయని పౌలు సూచించాడు (15:39). స్పష్టంగా, మృతిచెందిన శరీరము లేపబడు శరీరమునకు వేరుగా ఉండునని మరొక పర్యాయము ఆయన నిదర్శనాత్మకముగా ఉదహరించి చెప్పుచుండెను.

*భూవస్తువులు మరియు ఆకాశవస్తువులు.* చివరగా, *పౌలు భూవస్తువులను ఆకాశ వస్తువులను ఉదాహరణంగా ఉపయోగించుచున్నాడు.* ఇటువంటి వస్తువులు – భూమి, సూర్యుడు, చంద్రుడు, మరియు నక్షత్రములు – ఇవన్నీ కూడ ఒక దాని నుండి మరొకటి భిన్నముగా ఉన్నవి (15:40, 41),

ఇదే విధముగా, ("ఆలాగే"; 15:42), ఇహలోక మానవ శరీరము – మృతిచెందు

శరీరము పరలోక శరీరము- పునరుత్థానమగు శరీరము - వేరైయున్నవను అర్థమును పౌలు ధ్వనించుచున్నాడు. ఈ రెండింటిని పోల్చుటకు ఆయన 15:42-49లో వర్ణనల పరంపరలను ఉపయోగించాడు:

1. మొదటి శరీరము క్షయమగునదే; రెండవది అక్షయమైనది (42 వచనం).
2. మొదటిది ఘనహీనమైనదిగా విత్తబడును; రెండవది ఘనమైనదిగా మహిమలో లేపబడును (43 వచనం).
3. మొదటిది బలహీనమైనదిగా విత్తబడును; రెండవది బలమైనదిగా లేపబడును (43బి వచనం).
4. మొదటిది ప్రకృతి సంబంధమైన శరీరము; రెండవది ఆధ్యాత్మిక సంబంధమైన శరీరము (46 వచనం).
5. మొదటిది ఆదాము శరీరము వంటిది, మట్టితో చేయబడినది; రెండవది పరలోకము నుండి వచ్చిన రెండవ మనుష్యుని (క్రీస్తు) వంటిది (47-49 వచనాలు).

**పునరుత్థానమైన శరీరము భిన్నముగా ఉండవలసినదే**

ఈ వివిధ భావముల ప్రాముఖ్యతను నొక్కి వక్కాణించుచు పునరుత్థానమైన శరీరము యొక్క స్వభావము గూర్చిన తన చర్చను పౌలు ముగించుచున్నాడు (15:50-57). పరలోక శరీరము భౌతిక శరీరమునకు భిన్నముగా నుండునని గ్రహించుట ఎందుకంత ప్రాముఖ్యమైనది?

మనము మార్పునొందవలెను ఎందుచేతనంటే "రక్తమాంసములు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొన నేరవు" (15:50). క్షయమగు శరీరమునుండి అక్షయమగు శరీరమునకు మార్పుచెందుటకు అవసరమైయున్న అంశము రెండింటిలో ఒక విధముగా సంభవించునని పౌలు సూచించుచున్నాడు (15:51-51బి). మృతిచెందినవారు అప్పటికే వారి క్షయమగు శరీరములను వదిలిపెట్టారు గనుక నూతనమైన మరియు అక్షయమైన శరీరములను పొందుకొందురు. క్రీస్తు వచ్చినప్పుడు కొందరు సజీవులై యుందురు. గనుక వారి శరీరములు సహితము అక్షయమైన శరీరములుగా మార్పునొందించబడును. కాబట్టి, ఈ లెక్కచొప్పున అందరూ మార్పుచెంది అమర్త్యమును అక్షయమునైన శరీరములు గలవారై యుందురు (15:53).

ఇది జరిగినప్పుడు, ఇక మరణముండదు! పాపముండదు! ధర్మశాస్త్రముండదు! విజయమే. మనకు విజయమే ఉండును (15:54-47). ఎంత గొప్ప విజయము కదా! మరణము గతించిపోతుంది, మనమికముందు భౌతిక తనువుకు సంబంధించిన శారీరక సమస్యలను ఎదుర్కొనము. ఆహా, ఎంత గొప్ప ధన్యకరమైన నిరీక్షణ మనముందున్నది కదా!

**పౌలు బోధలలో గల అంతర్భావముల ధ్వనింపులు**

ఇంతకూ పౌలు ఏమి బోధిస్తున్నాడు లేక ఆయన మనస్సులోని మాట ఏమై యుండినది?

ఆయన కనీసము ఆరు సత్యములను మనముందుంచుచున్నాడు:

(1) అవి భిన్నమైనవైనప్పటికిని, మన శరీరములు పునరుత్థానమైన తరువాత శరీరములుగానే యుండును! మనము శరీరములు లేని ఆత్మలమై యుండము.

(2) పాత శరీరమునకును నూతన శరీరమునకును గల నిరంతరత కొనసాగుచుండును; మన నూతన శరీరములు విశిష్టముగాను అనుపమానమైనవిగాను మనవే అయ్యుండును.

(3) నూతన శరీరములు శ్రేష్ఠమైనవై యుండును – క్షయమైనవి గాక అక్షయమైనవి, మర్త్యమైనవి గాక అమర్త్యమైనవి, బలహీనమైనవి గాక బలమైనవై యుండును.

(4) శరీరము మార్పు చెందుట అనివార్యము; మనము ఇహలోక శరీరములతో పరలోకములో జీవించలేము.

(5) ఈ మార్పును ప్రతి ఒక్కరు – సజీవులైనవారును మృతులైనవారును – అనుభవించుదురు.

(6) క్రీస్తు వచ్చినప్పుడు సజీవులై యుండువారు, భౌతిక శరీరము నుండి ఆధ్యాత్మిక శరీరమునకు కలుగు మార్పు ఆ సమయములో జరుగును.

## ముగింపు

పునరుత్థాన సత్యము మరణము తరువాతి జీవితము గూర్చి మనకును మన ప్రియులకును ఎంతో *ఆదరణను* కలుగజేయును. నూతనమును, మెరుగైనవియునైన ఆధ్యాత్మిక శరీరములతో, మనము జీవించుచుందుము, వారు కూడ జీవించుచుందురు. ఇది అవిశ్వాసులకు సహితము సదవకాశముతో కూడిన ఒక *సవాలును* విసరుచున్నది. క్రీస్తు మృతులలో నుండి లేపబడినాడు, గనుక ఈ వాస్తవమును ఎవరునూ కాదనలేరు! అంతమాత్రమేగాక, ఆయన లేపబడి యున్నాడు గనుక, క్రీస్తు చేత ధ్రువీకరింపబడిన ఇతరమైన ప్రతీ వాస్తవము యథార్థమైనదిగా కనబడుచున్నది. కాబట్టి, మనము (*ఆత్మ*) విశ్వాసమును కలిగియుండగలము: మనము నమ్ముచున్నవానిని మనమెరుగుదుము, గనుక మనకు ఆయన పునరుత్థానములోను మన పునరుత్థానములోను *నమ్మకమున్నది.* మనము నమ్ముచున్నాము!

15:58లో *"కాగా, నా ప్రియ సహోదరులారా, మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థముకాదని యెరిగి, స్థిరులును, కదలనివారును, ప్రభువు కార్యాభివృద్ధి యందు ఎప్పటికిని ఆసక్తులునై యుండుడి" అని చెప్పుచు పౌలు తన చర్చను ముగించుచున్నాడు.* పునరుత్థానము గూర్చిన సిద్ధాంతము కేవలము మనము నమ్మవలసిన ఏదో ఒక అంశము కాదు. అయితే, మనము ప్రభువును హృదయపూర్వకముగా సేవించవలెనని అది మనకు పిలుపు నిచ్చుచున్నది. క్రీస్తు లేపబడినందు వలన – మనము కూడ లేపబడి క్రీస్తుతో కూడ సదాకాలము జీవించునట్లు నూతనమైన, అమర్త్యమైన శరీరములు ధరింపజేయబడుదుము గనుక – మనమేంచేద్దాము? అసలేంచేయాలి? యేసు క్రీస్తు నందలి పునరుత్థానములో మనము స్థిరులమును కదలనివారమునై యుండవలెను. సత్యములోనుండి అటు ఇటు కొట్టుకొనిపోకూడదు, కానీ ఎల్లప్పుడును ప్రభువు కార్యములలో ఆసక్తితో ముందుకు సాగుచున్నవారమై యుండవలెను. ఎందుకు? ఎందుకనగా మన ప్రయాసము వ్యర్థము

కాదు! అది ఈ జీవితములో వ్యర్థము కాదు, ముఖ్యముగా పునరుత్థాన దృష్ట్యా అది వ్యర్థము కానేరదు.

---

సూచనలు

[1]11వ అధ్యాయంలో ఆయన సవివరంగా చర్చించిన కొరింథీయుల కష్టముల గూర్చి ఆయనకు ఎలా ఎరుక అయ్యిందో అని అది తెలియజెప్పుచున్న దానిని మించి, కొరింథులో ఈ సమస్య ప్రచారములో ఉండినదని పౌలు ఎలా ఎరిగియుండెనో ఈ పత్రిక బయలుపర్చుట లేదు. ఊహించుకొనబడుచున్నట్లుగా, క్లోయె ఇంటివారు (1:11) లేదా కొరింథులోని ముగ్గురు (16:17) ఈ సమస్యలన్నిటి గూర్చి ఆయనకు తెలియజెప్పియుండవచ్చును. [2]"సువార్త" – ఇవాంజెలియోన్, శుభ వర్తమానము – యొక్క ప్రాముఖ్యతను పౌలు 1 కొరింథీయులలో తరుచుగా ఉల్లేఖించుచు సూచించాడు. 1 కొరింథీయులకు 1:17; 4:15; 9:12; 9:16; 9:23 చూడుము. [3]15:1–4 వచనములలో గల వాక్యభాగము సువార్త యొక్క మూడు వాస్తవములను నివేదించునని బోధకులు సాధారణంగా బోధిస్తుంటారు: యేసు మరణము, సమాధిచేయబడుట, మరియు పునరుత్థానము. ఏదిఏమైనా, ఈ వాక్యభాగము యొక్క వ్యాకరణ సంబంధితమైన నిర్మాణమును గమనించినట్లయితే అర్థ వివరణ చెప్పువారు యేసు యొక్క పునరుత్థాన ప్రత్యక్షతలను సువార్త సందేశ పరంపరలలో చేర్చవలెనని చెప్పుట అవసరమగుచున్నది, ఎందుచేతనంటే నాలుగు వాస్తవములు కూడ ఒక విధంగా పరిచయము చేయబడినవి. [4]రోమీయులకు 5:12–19 పోల్చి చూడుము. [5]బైబిలులోని అనేక ఇతర వాక్యభాగములలో ఇదే విధమైన అభిప్రాయము చూడనగును. యెషయా 56:12; ప్రసంగి 2:24 చూడుము (ప్రసంగి 3:12; 5:18; 8:15; 9:7 పోల్చి చూడుము); లూకా 12:19. అన్య జనులకు సంబంధించిన రచయితలు తరుచుగా ఈ తత్వశాస్త్రమును బోధించారు. (William Barclay, *The Letters to the Corinthians*, The Daily Study Bible, 2d ed. [Edinburgh: St. Andrews Press, 1954: reprint, Philadelphia: Westminster Press, 1956], 172-73.) [6]జీవితాంతము తరువాతి జీవితములో ఉండిన నమ్మకము అన్యమతస్థుల నడుమ సామాన్యమైన సంగతే అని Oster గుర్తించాడు, కానీ శరీర పునరుత్థానమును గూర్చిన ఆలోచన వారి దృష్టిలో హాస్యాస్పదమైనదై యుండినది. (Oster, 374-75.)